నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 25 ఏప్రిల్ 2024 | BHADRADRI KOTHAGUDEM

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత. పక్కన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

బీఆర్ఎస్ అభ్యర్థులదే గెలుపు

మహబూబాబాద్‌లో జనం లేక సీఎం సభ వెలవెల

బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత

మణుగూరులో బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గస్థాయి సమావేశం

మణుగూరుటౌన్, ఏప్రిల్ 24 : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుంటున్నదని, పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన ఆ పార్టీ అభ్యర్థులందరూ గెలుపొందడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత ధీమా వ్యక్తం చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గస్థాయి జనరల్‌బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన కవిత మాట్లాడుతూ అలవికాని హామీలు ఇచ్చి, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకుందన్నారు. మహబూబాబాద్‌లో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ప్రజలు ముఖం చాటేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై వ్యతిరేకతను అర్థం చేసుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనలో రైతుబంధు, దళితబంధు ఊసేలేదని, ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి చెల్లించిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే అది బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణమని, అధైర్యపడకుండా ప్రతి ఒక్కరూ పోరాట పఠిమతో పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ ముక్కు నేలకు రాసినా మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవి ఆగస్టు 15లోపు ఊడిపోతుందనే భయంతో దొంగ హామీలు ఇస్తున్నారన్నారు. పినపాక ఎమ్మెల్యేగా గెలిచిన పాయం వెంకటేశ్వర్లు అడ్డూ అదుపు లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. ఎవరు దందాలు చేస్తున్నారో తేల్చుకోవడానికి రెడీ అని, దొంగ ట్రాక్టర్లు ఇసుక తోలకానికి గోదావరికి పోతే అర్ధరాత్రి అయినా లేచి వస్తానన్నారు. ఎవరు ఎన్ని కేసులు పెట్టినా రేగా కాంతారావును భయపెట్టలేరన్నారు. 30న జరిగే కేసీఆర్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మణుగూరు జడ్పీటీసీ పోశం నర్సింహారావు, అశ్వాపురం జడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, బీఆర్ఎస్ పార్టీ మణుగూరు మండల, పట్టణ అధ్యక్షులు ముత్యం బాబు, అడపా అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ పొనుగోటి భద్రయ్య, సీనియర్ నాయకులు కోలేటి భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నామినేషన్లు

- మూడు సెట్లు దాఖలు చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- నామినేషన్ల దాఖలుకు నేడు చివరి తేది

నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నేతలు

నామినేషన్ పత్రాలను అందిస్తున్న అభ్యర్థి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 24 : లోక్‌సభ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో బుధవారం నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగింది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావు నాల్గో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాయల నాగేశ్వరరావుకి చెందిన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను లకావత్ సైదులు, బచ్చలికూర నాగరాజు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, బి.అనూష, డి.చంద్రశేఖర్‌సింగ్, డి.రాకేష్, మలీదు వెంకటేశ్వర్లులు దాఖలు చేశారు. సకలజనుల పార్టీ అభ్యర్థిగా పాపిట్ల రాంమూర్తి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా లింగాల రవికుమార్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోట్ల నాగేశ్వరరావు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థిగా ఎర్ర కామేశ్వరరావు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. జై బీమ్ భారత్ పార్టీ అభ్యర్థిగా కొప్పుల శ్రీనివాసరావు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా వాసం రామకృష్ణ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎస్‌కే. అజ్జు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా సోమగాని నరేందర్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా లింగం కృష్ణ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆలిండియా నేషనల్ రక్ష సేన పార్టీ అభ్యర్థిగా లకావత్ నాగేశ్వరరావు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నాగ సీతారాములుకి చెందిన ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించిన రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రతిజ్ఞ చేయించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

నామాను గెలిపించి కాంగ్రెస్ అంతు చూడాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలి
- ఎంపీ అభ్యర్థి నామా, మాజీ మంత్రి పువ్వాడ, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం, ఏప్రిల్ 24 : ఖమ్మం ఎంపీగా నామా నాగేశ్వరరావు గెలిస్తేనే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలవుతాయి.. గడపగడపకు వెళ్లండి.. ప్రతి తలుపు తట్టి కాంగ్రెస్ మోసాన్ని వివరించి నామా విజయానికి నడుం బిగించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖమ్మం సీక్వెల్ క్లబ్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయిలో పని చేయాలని, నామా గెలుపు కోసం ప్రతి కార్యకర్త నేనే నామా అనుకుని పని చేయాలన్నారు. నామాను మంచి మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ అంతు చూడాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలనను గాలికి వదిలి, ప్రతీకార చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. నామా గెలుపుతో ఆ పార్టీకి కనువిప్పు కలుగుతుందన్నారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయకపోతే సీఎం రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటపై ఈ నెల 26న అమరవీరుల స్తూపం వద్ద ప్రమాణానికి తాను సిద్ధమని, రేవంత్ కూడా అందుకు సిద్ధమా అని సవాల్ చేశారు. కాంగ్రెస్ పరిస్థితి పనికి ముందు ఓడ మల్లప్ప.. పని తర్వాత బోడ మల్లప్ప అన్న విధంగా ఉందన్నారు. కాంగ్రెస్‌వి తుపాకీ రాముడి మాటలన్న సంగతిని ప్రజలు గ్రహించారని, గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని అన్నారు. నామా గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ గెలుపుతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి : ఎంపీ నామా

ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయిలో పని చేయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. తెలంగాణ వాణి పార్లమెంట్‌లో వినిపించే సత్తా ఒక్క బీఆర్ఎస్ ఎంపీలకే సాధ్యమన్నారు. తనను గెలిపించి, కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌కు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

నామా గెలుపు ప్రతిఒక్కరి బాధ్యత : మాజీ మంత్రి పువ్వాడ

పార్లమెంట్ ఎన్నికలు మన పార్టీకి ముఖ్యమైన ఎన్నికలని, నామాను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్ష బీఆర్ఎస్ పార్టీ అని, కేసీఆర్ కారణంగానే రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్లిందన్నారు.

కృత్రిమ కరువు తెచ్చిన రేవంత్ : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు

తెలంగాణ ప్రజల గొంతుకను పార్లమెంటులో బలంగా వినిపించిన బీఆర్ఎస్ పక్ష నేత, పార్టీ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తిరిగి విజయం సాధించడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేవలం రెండు పిల్లర్లు కుంగితే నీళ్లను సముద్రం పాల్జేసీ రేవంత్‌రెడ్డి కృత్రిమ కరువు తెచ్చారని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి నెత్తిమీద కుంపటి పెట్టుకున్నామని ప్రజలు బాధపడుతున్నారన్నారు.

ఐక్యంగా పనిచేయాలి : ఎమ్మెల్సీ తాతా మధు

నామా గెలుపు ద్వారా కార్యకర్తలు సత్తా చాటాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి నామాను గెలిపించాలని కోరారు. పార్టీ ఇచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మదన్‌లాల్, ఖమ్మం మేయర్ నీరజ, బచ్చు విజయ్‌కుమార్, దుర్గ, బొమ్మెర రామ్మూర్తి, ఆర్జేసీ కృష్ణ, కర్నాటి కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలదే హవా..

- ఇంటర్ ఫలితాల్లో పైచేయి సాధించిన సరస్వతి పుత్రికలు
- రాష్ట్రస్థాయిలో ప్రథమ మార్కులు సాధించిన జిల్లావాసులు
- జిల్లాకు 'ప్రథమ'లో నాల్గవ స్థానం.. 'ద్వితీయ'లో ఐదో స్థానం
- ఫలితాల్లో సత్తా చాటిన ప్రైవేటు కళాశాలల విద్యార్థులు
- జిల్లా ఉత్తీర్ణత 'ప్రథమ'లో 63 శాతం, 'ద్వితీయ'లో 74 శాతం

అంజలి(ఎంపీసీ 993)

నందిత(ఎంపీసీ 993)

తేజస్విని(బైపీసీ 990)

ఖమ్మం, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. ఉత్తీర్ణత శాతం గతంతో పోలిస్తే ద్వితీయ సంవత్సరంలో అదే శాతాన్ని పదిలం చేసుకోగా.. ప్రథమ సంవత్సరంలో నాలుగు శాతం వెనుకబాటు కనిపించింది. అయినా రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలనే సాధించింది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో నాల్గవ స్థానాన్ని దక్కించుకోగా.. ద్వితీయ సంవత్సరంలో ఐదో స్థానాన్ని దక్కించుకుంది. నాలుగైదేళ్ల నుంచి జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మార్కుల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంటుండగా.. ఈసారీ దానిని కొనసాగించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎప్పటి మాదిరిగానే బాలికలే తమ హవా కొనసాగించారు. రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో సైతం బాలురతో పాటు బాలికలు మెరుగైన ప్రతిభ కనబర్చి సత్తా చాటారు. ప్రథమ ఇంటర్‌లో జిల్లా ఉత్తీర్ణత శాతం 63 కాగా.. అందులో బాలికలు 71.93 శాతం ఉత్తీర్ణత శాతం సాధించగా, బాలురు 55.85 శాతంతో సరిపెట్టుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో 74 శాతం సాధించగా.. వారిలో బాలికలు 80.44 శాతంతో రాణించగా.. బాలురు 67.77 శాతంతో సరిపెట్టుకున్నారు.

ప్రథమ సంవత్సరంలో...

బుధవారం ఇంటర్ బోర్డు ప్రకటించిన ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 63.84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, సాంఘిక సంక్షేమ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 16,015 మంది విద్యార్థులకు.. 10,224 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 8,054 మందికి.. 4,498 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 7,961 మందికి.. 5,726 మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా.. బాలురు 55 శాతం, బాలికలు 72 శాతంగా ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 2,466 మందికి.. 1,214 మంది ఉత్తీర్ణులై 49 శాతం ఫలితాలు సాధించారు.

ద్వితీయ సంవత్సరంలో...

ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జనరల్ విభాగంలో 14,564 మంది విద్యార్థులకు.. 10,806 మంది ఉత్తీర్ణులై 74.20 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 7,176 మందికి.. 4,863 మంది పాస్ అయి.. 67.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికల విభాగంలో 7,388 మందికి.. 5,943 మంది పాస్ అయి.. 80.44 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఒకేషనల్ విభాగంలో 2,071 మంది.. 1,404 మంది ఉత్తీర్ణత సాధించి 67.79 ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు.

టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు

ఎంపీసీ ద్వితీయంలో 993 మార్కులతో టాపర్‌గా శ్రీచైతన్య కళాశాలకు చెందిన బి.అంజలి నిలిచారు. ఎస్ఆర్ కళాశాలకు చెందిన శీలం నందిత ఎంపీసీలో 993 మార్కులతో, బైపీసీలో తేజస్విని 990 మార్కులతో టాపర్‌గా నిలిచారు.

గత సంవత్సరాలు ఫలితాలు ఇలా..

ప్రథమ ఇంటర్

సంవత్సరం	బాలుర శాతం	బాలికల శాతం	ఉత్తీర్ణత శాతం	స్థానం
2022	61	76	69	6వ స్థానం
2023	62	72	67	7వ స్థానం
2024	55.85	71.93	63.84	4వ స్థానం

ద్వితీయ ఇంటర్

సంవత్సరం	బాలుర శాతం	బాలికల శాతం	ఉత్తీర్ణత శాతం	స్థానం
2022	64	78	71	7వ స్థానం
2023	68	80	74	4వ స్థానం
2024	67.77	80.44	74.20	5వ స్థానం

కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురాంరెడ్డి

పంతం నెగ్గించుకున్న పొంగులేటి

ఖమ్మం అభ్యర్థిత్వం ఆశించిన కీలక నేతలకు షాక్

నేడు నామినేషన్ దాఖలు చేయనున్న రామసహాయం

ఖమ్మం, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఖమ్మం కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని ఖరారు చేస్తూ ఏఐసీసీ ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. దాదాపు 20రోజుల పాటు తీవ్ర తర్జనభర్జనల మధ్య ఎట్టకేలకు రఘురాంరెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో పార్టీ వర్గాల్లో కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. 25వ తేదీ నామినేషన్‌కు చివరితేదీ కావడంతో ఎట్టకేలకు బుధవారం రాత్రి అభ్యర్థిని ప్రకటించింది. ఖమ్మం టికెట్ కోసం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు హోరాహోరీగా పోరు సాగించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన సతీమణి నందిని కోసం, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సోదరుడు ప్రసాద్‌రెడ్డి కోసం, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన తనయుడు యుగంధర్‌కు టికెట్ కేటాయించాలని చివరినిమిషం వరకు పోరాడారు. అయితే రఘురాంరెడ్డికి ఖరారుకావడంతో పొంగులేటి వ్యూహం ఫలించిందని తెలుస్తోంది. కాంగ్రెస్ అధిష్టానం తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఇవ్వని పక్షంలో తన వియ్యంకుడు రఘురాంరెడ్డికి ఇవ్వాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అధిష్టానంపై అనేక రకాలుగా చేసిన ఒత్తిళ్ల నేపథ్యంలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకొని రఘురాంరెడ్డి పేరును ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మాజీమంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ బీ హనుమంతరావు, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి, ప్రియాంకగాంధీ పోటీచేస్తారని ప్రచారం జరిగింది. ఏదేమైనా రఘురాంరెడ్డికి టికెట్ లభించడంతో కాంగ్రెస్ అధిష్టానం వద్ద పొంగులేటి హవా కొనసాగుతుందనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఇతర నేతలు ఏ విధంగా స్పందిస్తారో అన్న అంశం చర్చనీయాంశమైంది. రఘురాంరెడ్డి తరపున మంత్రి పొంగులేటి అనుచరులు, రఘురాంరెడ్డి సమీప బంధువు నూకల నరేశ్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. నేడు ఉదయం 11గంటలకు రఘురాంరెడ్డి స్వయంగా ఖమ్మం వచ్చి పార్టీ నేతలు జిల్లాకు చెందిన మంత్రుల సమక్షంలో మరో రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. రఘురాంరెడ్డి అభ్యర్థిత్వం ఖరారు కావడంతో తుమ్మల, మల్లు భట్టి వర్గీయులకు షాక్ తగిలినట్లు అయ్యింది.